# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 357 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 12, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలకలగూడ, ప్యాట్నీ, ప్యారడైజ్, తిరుమలగిరి, ఆల్వాల్, కవాడిగూడ, దోమలగూడ, విద్యానగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, అడిక్ మెట్, గాంధీనగర్, బేగంపేట్, మారేడ్‌పల్లి, బంజారాహిల్స్, మల్కాజిగిరి, కీసర, చర్లపల్లి, కుషాయిగూడ, ఏఎస్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి.



# ఆదాయ లక్ష్యాలను చేరుకోవాల్సిందే..

- గత ఆర్థిక సంవత్సరాన్ని మించి రాబడులు రాబట్టాలి
- రాబడి కోసం ప్రతి విభాగం కఠినంగా ఉండాల్సిందే
- ప్రధాన శాఖలన్నీ ఆదాయం వసూళ్లలో ముందుండాలి
- ఆదాయం తెచ్చే శాఖలపై సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,జూలై11 (నమస్తే ఉదయం): రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను తయారు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సాధించిన పురోగతిని బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై, పన్నుల వసూళ్లపైన అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర్ వ్యవస్థీకరించుకోవాలని, ఆదాయం రాబట్టేందుకు వీలైనన్ని సంస్కరణలు చేపట్టాలని దిశా నిర్దేశర చేశారు. ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బ్జడెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకా నెలా మంత్లీ టాగట్‌ను నిర్దేశిరచుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క

మిగతా.. 2లో

# 24 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- వివిధ శాఖల అధికారులతో స్పీకర్ సమీక్ష
- బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు సర్కార్ సన్నాహాలు
- ఇప్పటికే బడ్జెట్‌పై భట్టి వరుస సమీక్షలు
- బిఆర్ఎస్ నేతలు భ్రమల నుంచి బయట పడాలి:శ్రీధర్ బాబు



హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం): ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభ మయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం మధ్యాహ్నం వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్‌తో పాటు ప్రభుత్వ విప్‌లు రామచంద్ర నాయక్, ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు హాజరయ్యారు. అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ ఆర్థికాంశాల గురించి మంత్రి జూపల్లికృష్ణారావు గురువారం సమీక్షించారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ప్రారంభం కాగా, సాయంత్రం వరకు కొనసాగింది. ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కానీ ఎన్ని రోజులు జరుగుతాయనే విషయంపై స్పష్టత రాలేదు. ఈ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అలాగే.. ముఖ్యమైన రైతు భరోసా పథకంపైనా కీలకమైన చర్చ జరిగే అవకాశం ఉన్నది. అసెంబ్లీలో చర్చించిన తర్వాత విధివిధానాలపై నిర్ణయానికి వస్తామని ఇది వరకే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

మిగతా.. 2లో

- 500 కోట్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకారం
- మంత్రి శ్రీధర్ బాబుతో ప్రతినిధుల భేటీ




## తెలంగాణలో టెలి కమ్యూనికేషన్స్ పెట్టబడి

హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం): అమెరికా టెలి కమ్యూనికేషన్స్ దిగ్గజం మైక్రోలింక్ నెట్ వర్క్ రూ.500 కోట్ల పెట్టుబడితో తెలంగాణాలో తమ ఎలక్ట్రానిక్, ఇతర ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో మైక్రోలింక్ పరిశ్రల క్లస్టర్‌ను ప్రారంభిస్తుందని తెలిపారు. గురువారం మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులు, భారతీయ భాగస్వామి 'పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ శ్రీరంగారావు మంత్రితో సచివాలయంలో సమావేశమయ్యారు. వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్, ఐటీ, నిర్మాణరంగ పరికరాలను ఉత్పత్తి చేస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. రానున్న మూడేళ్లలో 700 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో మైక్రోలింక్ నెట్ వర్క్ యాజమాన్యంతో జరిపిన

మిగతా.. 2లో

## ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

- విచారణ 15కు వాయిదా వేసిన హైకోర్టు



హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై గురువారం తెలంగాణ హైకోర్టు విచారణ చేప్టటింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేం దర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ ఎస్ నేతలు పిటిషన్ వేశారు. గురువారం హైకోర్టు విచారణ సందర్భంగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుముందు వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న హైకోర్టు .. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ ఎస్ ఎమ్మెల్యే వివేకానంద న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. కడియం శ్రీహరి, దానం నాగేదర్, తెల్లం వెంకట్రావులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్ లో చేరారని తెలిపారు. వీరిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన చర్యలు తీసుకోలేదని, కోర్టు స్పందించి ఆ ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా చేయాలని వివేకానంద పిటిషన్‌లో వెల్లడించారు.



## సిఎం రేవంత్ బండారం బట్టబయలు

- మెగా కంపెనీకే 11వందల కోట్ల కాంట్రాక్ట్ పనులు
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం): కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి వచ్చిన రూ. 3 వేల కోట్ల నిధులకు చీకటి టెండర్లు కోడ్ చేసి కుంభకోణం చేశారని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. శోధ, గజా, కేఎన్ఆర్ కంపెనీలకు కాంట్రాక్టు పనులు అప్పగించారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రేవంత్ బామ్మర్ది సుజన్ రూ.400 కోట్ల పనులు చేస్తున్నారు. మెగా కృష్ణారెడ్డికి రూ.11 వందల కోట్ల పనులు అప్పగించారు. ఎస్టిమెట్లు అన్ని కాంట్రాక్టర్లు

మిగతా.. 2లో

## తిరుమలలో ఇక భక్తులదే రాజ్యం

- దేవుడిని టచ్ చేశారు...ఫలితం అనుభవించారు
- ఎర్రదొంగలను వదిలేది లేదన్న బండి

తిరుమల,జూలై11(నమస్తే ఉదయం): శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయవంచకులు పోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు స్వామివారికి నిత్యం సేవ చేసే రాజ్యం వచ్చిందని చెప్పారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. తన పుట్టినరోజు సందర్భంగా బండి సంజయ్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ నేపథ్యంలో వైసీపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు బండి. తిరుమలలో శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయవంచకులు దిగిపోయారని అన్నారు. ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను పూర్తిగా కొల్లగొట్టారని మండపడ్డారు. స్వామివారిని టచ్ చేశారు కాబట్టే ఘోరంగా ఓడిపోయారని అన్నారు. దేవుడి ఆస్తులను దోచుకొని తింటే ఎవ్వరికైనా ఇలాంటి గతే పడుతుందని అన్నారు. జగన్ హయాంలో టీటీడీ రాజకీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రంగా మారిందని బండి ఫైర్ అయ్యారు. ఎర్రచదనం దొంగలను వదిలిపెట్టే ప్రసక్తే



లేదని అన్నారు. నయవంచకులు పోయి, స్వామి వారికి నిత్యం సేవ చేసే సేవకులు వచ్చారని అన్నారు. ఏపీలో గత వైకాపా ప్రభుత్వ పాలకులు వీరప్పన్ వారసులని అబివర్ణించారు. ఎర్రచందనం

మిగతా.. 2లో



## నిజమైన రైతులకే రైతుభరోసా

- పకడ్బందీగా పథకం అమలుకు చర్యలు
- సలహాలను సేకరించిన కేబినెట్ సబ్ కమిటీ
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో పర్యటించిన మంత్రులు
- నిజమైన రైతులకే సహాయం అందిస్తామన్న భట్టి

ఆదిలాబాద్,జూలై11(నమస్తే ఉదయం): క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పూర్తిస్థాయి మార్గదర్శకాలతో 'రైతుభరోసా' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో రైతు భరోసా విధివిధానాల ఖరారుపై ఉమ్మడి అదిలాబాద్ జిల్లా రైతుల నుండి అభిప్రాయాలు, సలహాలను కేబినెట్ సబ్ కమిటీ సేకరించింది. కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్, ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి

మిగతా.. 2లో



## హైదరాబాద్‌ను నిర్ల్యక్ష్యం చేసిన ఘనత కిషన్ రెడ్డిదే

- కేంద్రమంత్రిగా ఒక్క పనీ చేయలేక పోయారు
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం): పార్లమెంట్ సభ్యుడిగా.. కేంద్రమంత్రిగా ఉండి హైదరాబాద్ అభివృద్ధికి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని తెలంగాణ మంత్రి పొన్న ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసినట్లుగా, అభివృద్ధి కుంటుపడినట్లుగా కిషన్‌రెడ్డి

మిగతా.. 2లో

## సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్

- కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టించండి
- కేంద్రమంత్రిగా ఈ అవకాశం ఉపయోగించండి
- గతంలో అనేకమార్లు విన్నవించినా ఫలించలేదు
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కు కెటిఆర్ లేఖ

హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం): ఈసారి కేంద్ర బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకుని రావాలని కోరుతూ కేంద్రమంత్రి బండి సంజజ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. అయితే రెండోసారి మీరు ఎంపీ కావటం, కేంద్రంలో కూడా మంత్రిగా పదవి దక్కటంతో సిరిసిల్ల నేతన్నలకు సేవ చేసేందుకు మీకిది సరైన సమయం అని గుర్తించండి అని తెలిపారు. పదేళ్లుగా ప్రతి బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు మొండిచెయ్యి చూపిందని గుర్తు చేశారు. అనేకసార్లు పవర్‌లూమ్ క్లస్టర్ కోసం పదిసార్లు కేంద్రానికి లేఖలు, స్వయంగా కలిసి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ సారైనా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తెప్పించండి. కేంద్ర మంత్రిగా మీకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోండి. ఈసారి కేంద్రబడ్జెట్‌లో సిరిసిల్లకు శుభవార్త అందేలా చూడాలని బండి సంజయ్‌ను కేటీఆర్ కోరారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని కేటీఆర్ కోరారు. కేంద్రంలో



బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ప్రధాని మోదీని ఒప్పించి సిరిసిల్లా మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది, మీరు ఈ ప్రాంత ఎంపీగా ఐదేళ్ల క్రితం ఎన్నికయ్యారు కానీ

మిగతా.. 2లో

# సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్

**మొదటిపేజీ తరువాయి..**

నేతన్నలకు ప్రతిసారి నిరాశానే ఎదురైందన్నారు. గతంలో పదేళ్లుగా సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చేందుకు తాను ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదన్నారు. సుమారు పదిసార్లు కేంద్రంలో స్మృతి ఇరానీ, అరుణ్ జైట్లీ వంటి అనేక మంది మంత్రులను నేను స్వయంగా కలిసినా దక్కింది శూన్యం అన్నారు. బండి సంజయ్‌ను కూడా ఎన్నోసార్లు ఈ అంశంలో సహకారం అందించాలని కోరినప్పటికీ మీరు పట్టించుకోలేదని అన్నారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ఈ బ్జడెట్‌లో సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ కస్టర్‌ను ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని, ఉపాధి లేక ఇక్కడి కార్మికులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సంగతి మీరు గుర్తించండన్నారు. గత ప్రభుత్వం నేతన్నల కోసం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ సర్కారు పాతరేయడంతో చేనేత రంగం మరోసారి పదేళ్ల తర్వాతా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనేక సార్లు కోరినా, ప్రభుత్వం పట్టించుకోవటం లేదని కేటీఅర్ ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులు కష్టాల్లో ఉన్న ఈ కీలక సమయంలో వారిని ఆదుకునే మంచి అవకాశం ఇప్పుడు కేంద్రం చేతుల్లో ఉందన్నారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఇక్కడి నేతన్నల కష్టాలు కొంత మేరకు తీరుతాయని, చేతినిండా పని దొరికి మళ్లీ ఆత్మహత్యలు లేని సిరిసిల్లను చూసే అవకాశం ఉంటుందన్నారు. క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన నైపుణ్యం కలిగిన కార్మికులు, వనరులు ఈ ప్రాంతంలో పుష్కలంగా ఉన్నాయని, నేతన్నలు, చేనేతలను ఆదుకోవటానికి గత పదేళ్లుగా కేంద్రం నుంచి ఎలాంటి సాయం అందకపోవటం దురదృష్టకరం, భాదకరమన్నారు. వనరులు లేని రాష్ట్రాలకు సైతం కేంద్రం అనేకరకాల ప్రాజెక్టులను మళ్లిస్తున్నందున, అన్నీ సానుకూలాంశాలున్న సిరిసిల్లాకు మేలు జరిగే దిశగా బండి సంజయ్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి బ్జడెట్‌కు ముందుకు ఈ అంశంలో కేంద్రానికి విజ్ఞప్తి చేసేవారమన్నారు. ఈ బ్జడెట్ పెట్టే నాటికే ఆర్థిక మంత్రిత్వ శాఖా మంత్రిని కలిసి సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ ప్రాధన్యతను, దాని వల్ల జరిగే లబ్ధిని, వారి దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రజలు ఎక్కువ మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న మీ మాటలు నమ్మి మిమ్మల్ని గెలిపించారని, కానీ గత ఐదేళ్లలో కరీంనగర్‌కు గానీ సిరిసిల్ల నేతన్నలకుగానీ బండి సంజయ్ పదవీకాలంలో జరిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ఎంపీలు మాత్రం తమ ప్రాంత ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాటం చేసి తమ ప్రాంతాలకు నిధులను, పరిశ్రమలను తరలించుకుపోతున్నారని, కనుక తెలంగాణ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మన ప్రాంత ప్రయోజనాల కోసం కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్ లో కచ్చితంగా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ ప్రకటన చేయిస్తారని భావిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు.

## తిరుమలలో ఇక భక్తులదే రాజ్యం

**మొదటిపేజీ తరువాయి..**

పేరుతో జాతీయ సంపదను దోచుకున్నారు. ఆ డబ్బుతో రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకున్నారు. ఎర్రచందనం దొంగలను వదిలిపెట్టేదే లేదని ఈ సందర్భంగా కేంద్రమంత్రి హెచ్చరించారు. గత అరాచక ప్రభుత్వంలో స్వామివారి నిధులను పక్కదారి పట్టించి తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. శేషాచలం కొండల్లో ఎర్రచందనం దోపిడీపై నివేదిక కోరతాం. దాని ఆధారంగా జాతీయ సంపదను దోచుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం అని వెల్లడించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై గతంలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తిరుపతి భాజపా నాయకులు అనేక పోరాటాలు చేశారు. కొండ మీద అరాచక పాలన ముగిసింది. ఇన్నాళ్లు భక్తులు ఎదుర్కొన్న సమస్యలు తొలగి పరిస్థితులు చక్కబడ్డాయి. స్వామివారి ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. నరేంద్ర మోదీ దేశాన్ని విశ్వగురువుగా చేసేందుకు కృషి చేస్తున్నారు. ఆయన సారథ్యంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతోందని బండి సంజయ్ అన్నారు.

## తెలంగాణలో టెలి కమ్యూనికేషన్స్ పెట్టబడి

**మొదటిపేజీ తరువాయి..**

చర్చలు ఫలవంతం అయ్యాయని అన్నారు. అనంతరం తెలంగాణాలో పెట్టుబడులకు అంగీకరించిందని శ్రీధర్ బాబు తెలిపారు. డేటా ట్రాన్స్ మిషన్, నెట్ వర్కింగ్ కేబుల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మల్టీ లెవెల్ పార్కింగ్ మిషన్ల ఉత్పత్తిలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ గ్లోబల్ లీడర్‌గా ఉంది. ఇప్పుడా కంపెనీ పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో పరిశ్రమలను ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణాలో నైపుణ్యం ఉన్న సిబ్బందికి కొరత లేదని వెల్లడించారు. సమావేశంలో పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ శ్రీరంగారావు, డైరెక్టర్ నమ్రుత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం, మైక్రోటెక్ గ్లోబల్ ప్రతినిధులు డా. డెనిస్ మొటావా , సియాన్ ఫిలిప్స్, జో జోగ్భి, అశోక్ పెర్సోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ బండారం బట్టబయలు

**మొదటిపేజీ తరువాయి..**

తయారు చేసుకున్నారు. రూ.600 కోట్లతో అయ్యే పనికి వెయ్యి కోట్ల రూపాయలుగా ఎస్టిమెట్లు తయారు చేశారు. కాంట్రాక్టర్లు 30 నుంచి 35 శాతం లెస్ వేసి టెండర్లు దక్కించుకున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఒక్క జీవోను కూడా పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం లేదు. టెండర్ డాక్యుమెంట్స్‌ను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టడం లేదని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై ఒక వైపు జ్యుడిషియల్ విచారణ జరుగుతుంటే? అదే మెగా కృష్ణారెడ్డికి రూ. 11 వందల కోట్ల పనులు ఎలా అప్పగించారు..? ఏడు నెలల్లో చేసిన చీకటి ఒప్పందాలకు, టెండర్లకు.. విచారణకు సిద్ధమా..? హెటిరో డ్రగ్స్ భూమి విషయంలోనూ, సివిల్ సప్లై అవినీతిపై విచారణకు సిద్ధమా..? కొడంగల్ ప్రాజెక్టు కూడా మెగా కృష్ణారెడ్డికే అప్పగించబోతున్నారు. తెలంగాణలో చీకటి కోణంలో చీకటి పాలన కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం నిధుల దుర్వినియోగంపై సీబీఐ, ఈడీ విచారణ చేయాలని కోరనున్నట్లు మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

### హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసిన
## ఘనత కిషన్ రెడ్డిదే

**మొదటిపేజీ తరువాయి..**

మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. కేంద్రం హైదరాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేదని, అమృత్ పథకం నుంచి ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతోనే రాజకీయ లబ్ధి కోసం హైదరాబాద్‌ను విమర్శిస్తున్నారని ఆక్షేపించారు. 'హైదరాబాద్.. చారిత్రక నగరం ఇస్తాంబుల్ వంటిది. చార్మినార్, గోల్కొండ వంటి ఆర్కియాలజీకి సంబంధించి ఎన్నో ఉన్నాయి. కేంద్ర పర్యాటక మంత్రిగా గత ఐదేళ్లలో కేంద్రం నుంచి హెరిటేజ్, టూరిజం, ఆర్కియాలజీ విభాగాల నుంచి హైదరాబాద్‌కు కిషన్‌రెడ్డి ఏం తెచ్చారు? ఒక్క రూపాయి అయినా తెచ్చారా? మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం నుంచి నిధులు కావాలని అనేక సార్లు విజ్ఞప్తి చేశాం. హైదరాబాద్‌లో 151 ప్రాంతాల్లో వర్షం వచ్చినప్పుడు నీటి నిల్వలతో సమస్యలు ఏర్పడుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఇంఛార్జి మంత్రిగా ఇక్కడి సమస్యలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నా. వీలైతే హైదరాబాద్ అభివృద్ధికి సహాయం చేయండి. భాజపాపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక నిధులు తీసుకురాలేకపోయిన కేటీఆర్.. ఇప్పుడు హైదరాబాద్ గురించి మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. భూకబ్జాలు, అక్రమ కట్టడాలతో హైదరాబాద్ ఇలా కావడానికి కారణం కేటీఆరే. మా ప్రభుత్వం వచ్చి ఆరు నెలలే అయింది. ఈ ఆరు నెలల్లో జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ కలెక్టరేట్‌లో అనేక సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నాం. బోనాల పండగ తర్వాత నేరుగా బస్తీల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తాం. ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగితే ఉద్యోగ నియామకాలు ఏమైయ్యాయని అడిగింది ప్రతిపక్షాలే. పక్రియ ప్రారంభమైన తర్వాత అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నదీ వీళ్లే. ఈ పదేళ్లలో టెట్, డీఎస్సీ నిర్వహించనోళ్లు ఇప్పుడు నిరుద్యోగులను ఎందుకు రెచ్చ గొడుతున్నారు? నిజమైన సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని విద్యార్థి సంఘాల నాయకులను కోరుతున్నా'అని మంత్రి పొన్నం తెలిపారు.

### పన్ను వసూళ్లలో
# నెరవేరని లక్ష్యం

**బకాయిలు రాబట్టడంలో కష్టాలు**

**హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం):** పన్నులపై వడ్డీలమీద వడ్డీల భారం పడడంతో, ఇంటిపన్నుల వసూళ్లు మందగించాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇంటిపన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణాలు విస్తరించడం,కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డా ప్రజల ఆదాయవనరులు పెరగడం లేదు. దీంతో పట్టణాల్లో వ్యాపారాలు చితికి పోతున్నాయి. పురపాలికలు రోజు రోజుకు విస్తరిస్తుండగా, ఆ మేరకు ఆదాయం రావడం లేదు.

పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు ఓవైపు మాల్స్, వ్యాపార సముదాయాలు, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగడం లేదని అంటున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాల విషయంలో కొందరు అద్దె చెల్లిస్తుండగా, మరికొందరు పెండింగ్‌లో పెట్టడంతో మునిసిపల్ ఆదాయం దెబ్బతింటోంది. లీజుకు తీసుకున్న వారు పెద్ద మొత్తంలో సబ్ లీజుకు దుకాణాలను ఇచ్చుకుంటున్నారు. దీనివల్ల కూడా రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. మునిసిపాలి టీకి పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. పన్ను వసూల్ళలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల మునిసిపాలిటీకి రావాల్సిన మేర ఆదాయం రావడం లేదని తెలుస్తోంది. మాల్స్, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు విస్తరిస్తుండటంతో పట్టణం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు సమకూర్చా లంటే పన్నుల రూపంలో ప్రజలు ఆదాయం చెల్లించాల్సి ఉంది. అధికార యంత్రాంగం నిర్లిప్తత, కింది స్థాయి ఉద్యోగుల ఉదాసీనత కారణంగా సరైన అస్సెస్‌మెంట్ చేయకపోవడం వల్లే పట్టణం పరిగినంత వేగంగా ఆదాయం పెరగడం లేదని తెలుస్తోంది.

# అదుపుతప్పిన శాంతిభద్రతలు

**కుప్పకూలుతున్న రియల్ రంగం**

**పాతకశీర్షికల్లో వార్తలు వస్తున్నా లేని చలనం**

**రేవంత్ ప్రభుత్వంపై కెటిఆర్ ఆగ్రహం**

**హైదరాబాద్,జూలై11(నమస్తే ఉదయం):** ఈ మహానగరానికి ఏమైంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రియల్ రంగం కుప్పకూలిపోతుండగా, శాంతి భద్రతలు అదుపు తప్పాయని అన్నారు. ప్రముఖ పత్రికలు కూడా ఈ నగరానికి ఏమైందని ప్రముఖంగా వార్తలు రాస్తున్నాయంటే నగరంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని అర్థమని వివరించారు. పరిపాలనా అనుభవం లేని నాయకత్వం ఎలా ఉంటుందో హైదరాబాద్ నుంచి తెలంగాణ పల్లెటూరు వరకూ అంతటా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'బ్రాండ్ హైదరాబాద్' ఎందుకు మసకబారుతోంది. విశ్వనగరంగా ఎదుగుతున్న వేళ.. ఎందుకింత కళ కోల్పోతోందని సగటు హైదరాబాదీకి అనిపిస్తుందని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ ను ప్రేమించే ప్రతిఒక్కరిలో ఇదే ఆవేదన ఉందని తెలిపారు. పదేళ్లు ప్రశాంతంగా ఉన్న నగరంలో వరుస హత్యలు.. అంతరాష్ట్ర ముఠాలు పెరిగిపోతున్నాయని,పేట్రేగిపోతున్న అన్నారు. రాజధాని హైదరాబాద్‌లో శాంతి లేదని.. నగర ప్రజల జీవితాలకు భద్రత లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం గారు స్వయంగా పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ కు వస్తున్నా.. పోలీసింగ్‌పై కమాండ్ ఏది అని ప్రశ్నించారు. క్షీణిస్తున్న శాంతిభద్రతలపై కంట్రోల్ ఏది అని నిలదీశారు. ఓవైపు.. కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం.. పరిపాలనా వైఫల్యాన్ని వేలెత్తి చూపుతోందని తెలిపారు. మరోవైపు.. పడగవిప్పిన హత్యల సంస్కృతి.. ప్రతి కుటుంబంలో వణుకు పుట్టిస్తోందన్నారు. ఇంకోవైపు.. తరలిపోతున్న పెట్టుబడుల పర్వం.. యువత ఉపాధి అవకాశాల్ని దెబ్బతీస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పవర్ లోకి రాగానే గడియ గడియకు ఏమిటీ.. పవర్ కట్ అని కేటీఆర్ ప్రశ్నించారు. సేఫ్ సిటీగా ఉన్న మహానగరంలో క్రైమ్ రేట్ ఎందుకు పెరిగిపోతుందని నిలదీశారు. ఇదేనా మీరు తెస్తానన్న మార్పు అని మండి పడ్డారు. విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి.. పదేళ్లు కష్టపడి పునాదులు వేస్తే.. అధికారంలోకి రాగానే ఆగం చేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంతో పోటీపడే నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ ప్రగతికి అర్ధాంతరంగా బ్రేకులు వేస్తే ఎలా ? దేశ రాజధాని చుట్టూ.. రాజకీయ చక్కర్లు కొట్టడంపై ఉన్న శ్రద్ధ.. చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర రాజధానిపై లేకపోతే ఎలా ? అని మండిపడ్డారు.

. హైదరాబాద్ అంటే.. కేవలం రాజధాని కాదు.. తెలంగాణ ఎకనమిక్ ఇంజన్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకనైనా.. కాంగ్రెస్ సర్కారు మేల్కొనకపోతే.. మన హైదరాబాద్ దెబ్బతింటే.. యావత్ దేశానికి కూడా నష్టమని కెటిఆర్ తెలిపారు.



# 24 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..

అలాగే, జాబ్ క్యాలెండర్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం సమావేశాల్లో ప్రకటించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈనెల 23 న కేంద్ర బడ్జెట్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. అందులో రాష్ట్రానికి కేటాయింపులను బట్టి పూర్తి స్థాయి బడ్జెట్ ను కాంగ్రెస్ సర్కార్ ప్రవేశ పెట్టనుంది. ఈనెల 25 లేదా 26న రాష్ట్ర పూర్తి స్థాయి వార్షిక బ్జడెట్ ను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఈసారి జరిగే సమావేశాల్లో రైతు భరోసా, రైతు రుణమాఫీ లాంటి అంశాలపై వాడి వేడి చర్చ జరగనుంది. కొత్త ఆర్వోఆర్ చట్టం, తెలంగాణ చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పులపై కూడా చర్చ జరగనుంది. పలు కీలక బిల్లులు కూడా రేవంత్ సర్కార్ ప్రవేశ పెట్టనుంది. ఇంకా ఆరు గ్యారెంటీల అమలు, నిరుద్యోగుల ఆందోళన, లా అండ్ ఆర్డర్ అంశాలపై ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు అసెంబ్లీ వేదికగా ప్రశ్నించే అవకాశం ఉంది. ఇదిలావుంటే అధికారం కోల్పోయి ఏడు నెలలైనా బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇప్పటికీ భ్రమల లోకం నుంచి బయటకు రాలేక పోతున్నారని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లడం ఆపి ఓటమిని సమీక్షించుకోవాలని సూచించారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపితే స్వాగతిస్తామని, నిస్పృహతో కూడిన ప్రకటనలతో తమలో ఉన్న గందరగోళాన్ని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రజాప్రయోజనం ఉండదన్నారు. రాజకీయ పార్టీల గెలుపు ఓటములను ప్రజలే నిర్ణయిస్తారన్నారు. ప్రజాభిమానం ఉన్నంతకాలమే ఏ రాజకీయ పక్షమైనా కొనసాగు తుందని చెప్పారు. ఇంత జరిగినా పార్టీ అధినేత కేసీఆర్ తీరులో ఏమాత్రం మార్పు రాలేదని విమర్శించారు. నేలమట్టమైన పార్టీని నాలుగున్నరేళ్ల తర్వాత అధికారంలోకి తీసుకొచ్చి 15 ఏళ్లు నిరాటంకంగా పరిపాలిస్తామని చెబుతున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలను తార్కికతకు దగ్గరగా లేని అందమైన ఊహ అనుకోవాలన్నారు.

# నిజమైన రైతులకే రైతుభరోసా

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో కీలకమైన రైతు భరోసా పథకాన్ని ప్రజాక్షేత్రంలో రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేసి తీరుతుందన్నారు. అన్ని జిల్లాల్లో కేబినెట్ సబ్ కమిటీ పర్యటించి ప్రజా క్షేత్రంలో అభిప్రాయాలు సేకరించి ఈ అసెంబ్లీలో నివేదిక పొందుపరుస్తామని అన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం అందించే రైతు భరోసా పేద బడుగు వర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలని విజ్ఞప్తులు వస్తున్నాయని అన్నారు. రైతు భరోసా సాయంపై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు ఖరారు కాలేదని, గ్రామం యూనిట్‌గా తీసుకోవాలని ఎక్కువ మంది రైతులు సూచిస్తున్నారని పేర్కొన్నారు. పోడు రైతులకు సర్కారు సాయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రాష్ట్ర ఆర్థిక భారం దృష్ట్యా పెద్ద రైతులకు పక్కనపెట్టి పేద, దళిత గిరిజన రైతులకు అందించాలని పలువురు రైతులు కోరారు. మెస్రం జంగు అనే గిరిజన రైతు మాట్లాడుతూ.. వర్షాధారంపైనే తాము పంట సాగు చేస్తున్నామని, ఖర్చులు పోను ఏమీ మిగలడం లేదన్నారు. కౌలు రైతులకు కూడా సగం వంతు, మిగిలిన సగం ఆర్థిక సాయం పట్టా రైతులకు అందించాలని అన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పది ఎకరాల సాగు చేసే రైతులందరికీ తప్పకుండా రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సర్కారు పంటల సాయం నిలుపుదల చేయాలని, రియల్ ఎస్టేట్ భూములు, సాగుకు పనికిరాని బీడు భూములకు కూడా పంటల పెట్టుబడి సాయాన్ని ఆపివేయాలని ప్రకాష్, గుణవంతు అనే రైతులు కోరారు.ఫసల్ బీమా యోజన ప్రీమియం చెల్లించండని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ల్గ÷తులకు విపత్తు సమయంలో పరిహారం అందించే ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, రైతుల ప్రీమియం డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. బడా పారిశ్రామికవేత్తలకు, మూడు పంటలు సాగు చేసే పెద్ద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకుండా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని 10 ఎకరాలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా అమలు చేయాలని కోరారు. బడ్జెట్లో 20 శాతం నిధులు ఉమ్మడి ఆదిలాబాద్‌కు కేటాయించాలి.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కోరారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో 80 శాతం రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేసి నష్టపోతున్నారని, ఈ జిల్లాకు ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ అమలు చేయాలని అన్నారు. బడ్జెట్లో ఎక్కువ మొత్తం నిధులు ఖమ్మం జిల్లాకు వెళ్తున్నాయని చలోక్తిగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ముందు వరుసలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా 20శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ పథకం అమలులో రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకే ఉమ్మడి జిల్లాల సూచనలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు చెప్పారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ.. అన్ని వర్గాల రైతులను ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధు పథకంతో చేరువయ్యారని, ఈ పథకంలో ఆంక్షలు విధించవద్దని కోరారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార మాట్లాడుతూ.. రైతులకు పంటల పెట్టుబడి సాయం కింద రైతుభరోసా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామన్నారు. ఆ హామీ అమలుకు తమ ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రైతుభరోసా అమలుపై విధివిధానాల రూపకల్పన చేస్తామన్నారు. ఇందుకోసమే తమ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి.. ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ సభ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిజమైన రైతులకే రైతు భరోసా అందించేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ఆలోచనల మేరకు అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రైతుభరోసా అందిస్తామన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ మరో సభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిజమైన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. మరో 8 ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు.

రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎంపీ గొడెం నగేష్ శాసనసభ్యులు అనిల్ జాదవ్, రామారావ్ పటేల్, హరీష్ రావు, వెడ్మా బొజ్జు , పెద్దపల్లి ఎంపీ వంశీ, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఆదాయ లక్ష్యాలను చేరుకోవాల్సిందే..

**మొదటిపేజీ తరువాయి..**

సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశ మవుతారని చెప్పారు. ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సూచించారు.

ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అటు కమర్షియల్ నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే వరుసలో పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.


ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా.. అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసుతో సంబంధం లేదు

**ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు లేఖ**

**ఆలస్యంగా వెలుగు చూసిన వైనం**

**హైదరాబాద్,జూలై 11 (నమస్తే ఉదయం):** ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు రాసిన లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్ 23న ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకు సంబంధం లేదని అందులో పేర్కొన్నారు. జూన్ 26న తాను భారత్‌కు రావాల్సిందని.. ఆరోగ్యం బాగోలేక అమెరికాలో ఉండిపోవాల్సి వచ్చిందని వివరించారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు చెప్పారు. అమెరికా వైద్యుల సూచనతో అక్కడే చికిత్స పొందుతున్నట్లు ప్రభాకర్‌రావు తెలిపారు.



నాకు గతంలో ఉన్న మలిగ్నెంట్ క్యాన్సర్‌తో పాటు ఇప్పుడు బీపీ పెరిగింది. నాపై అసత్య ఆరోపణలు చేస్తూ మీడియాకు లీకులు ఇస్తున్నారు. నేను, నా కుటుంబం మానసికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఓ పోలీసు అధికారిగా ఎలాంటి తప్పు చేయలేదు. చట్టపరంగా విచారణ జరిపించాలని కోరుతున్నాను. దర్యాప్తులో పోలీసులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నా. టెలీకాన్ఫరెన్స్‌లో, మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వడానికైనా సిద్ధం. క్రమశిక్షణ గల అధికారిని.. విచారణ ఎదుర్కొంటా. ఎక్కడికీ తప్పించుకుని పారిపోయే పరిస్థితి లేదు. పూర్తిగా కోలుకున్నాక మీ ముందు హాజరై అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తాను. నా దృష్టికి వచ్చిన సమాచారాన్ని విచారణాధికారికి చెబుతాను' అని ప్రభాకర్‌రావు లేఖలో పేర్కొన్నారు.





## బుద్వేల్ కట్ట మైసమ్మ దేవాలయంలో వారాహి దేవి నవరాత్రి మహోత్సవాలు

రాజేంద్రనగర్,జులై 11(నమస్తే ఉదయం):
బుద్వేల్ కట్ట మైసమ్మ దేవాలయంలో వారాహి దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని ప్రతిరోజు ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.గురువారం దేవాలయ ఆవరణలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ప్రతిరోజు దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

## గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం చెట్లను ఓ బిజెపి నాయకులు నరికివేత..

రాజేంద్రనగర్,జులై 11(నమస్తే ఉదయం):
గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పథకంలో అధికారులు తమ టార్గెట్ ను పూర్తి చేయాలనే ఆత్రుతలో నాటిన మొక్కలను నేడు ఆ చెట్లలను నరికి వేస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండితోపాటు లక్ష్యం నీరుగారుతోందని విమర్శలు



హరితహారంలో నాటిన మొక్కలను నరికిన బిజెపి నాయకుడు

వినిపిస్తున్నాయి.రాజేంద్రనగర్ సర్కిల్ లక్ష్మీగూడ మల్లికార్జున కాలనీలోని రోడ్ల వెంబడి మొక్కలు నాటారు.ఈ మొక్కలు ఏపుగా పెరిగాయి.దీంతో స్థానిక ఓ బిజెపి నాయకులు,మాజీ వార్డ్ మెంబర్, కాలనీ అధ్యక్షుడు ఆ చెట్లను నరికి వేశారు.పెరిగిన చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు మొక్కలు నాటే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకొని మొక్కలు నాటితే ప్రభుత్వ లక్ష్యం విజయవంతం అవుతుందని చెట్టుకు గొడ్డలి వేటు తప్పుతదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ నాయకుడు సానేం శ్రీనివాస్ గౌడ్

రాజేంద్రనగర్,జులై 11(నమస్తే ఉదయం):
తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నిర్మలరెడ్డి బుధవారం ప్రమాణస్వీకారం చేయగా, ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సానేం శ్రీనివాస్ గౌడ్ వెళ్లారు. ఆమెను సానేం శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా



కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకంగా అభినందించారు. నిర్మల రెడ్డికి కార్పొరేషన్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సానేం శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. నిర్మలరెడ్డికి కార్పొరేషన్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ధైర్యంగా ఉండండి.. బీఆర్ఎస్‌దే భవిష్యత్తు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(నమస్తే ఉదయం):
రాబోవు రోజులు బీఆర్ఎస్ వేనని కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు జిల్లా సమన్వయ కర్త శాట్స్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ భరోసా ఇచ్చారు. బీఅర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం కేటిదొడ్డి, ధరూర్ మండల కేంద్రాలలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ నడిగడ్డలో బీఆర్ఎస్ ప్రభంజనాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హన్మంతు నాయుడు, సీనియర్ నాయకుడు నాగర్ దొడ్డి వెంకట్ రాములు,అంగడి బస్వరాజు,టీఆర్ఎస్ వెంకటేష్, టవర్ మగ్బుల్, నూర్ పాష,బీఅర్ఎస్వీ జిల్లా నాయకుడు కుర్వ పల్లయ్య, బీఅర్ఎస్ సీనియర్ యువజన నాయకులు, మోనేష్, మందా మల్లి, పవన్ సాగర్, బొమ్మల రామకృష్ణ, బొప్పల శ్రీ నివాసులు, మ్నెహన్ గౌడ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు గట్టి షాక్..

# నేడు కాంగ్రెస్‌లోకి మరో ఎమ్మెల్యే.!

**కాంగ్రెస్‌లోకి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ - ప్రకాశ్ గౌడ్‌తో ఇద్దరు మున్సిపల్ చైర్మన్లు - సీఎం రేవంత్ సమక్షంలో చేరిక**

రాజేంద్రనగర్,జులై 11(నమస్తే ఉదయం):
అసెంబ్లీ,లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవం చవిచూసిన కారు పార్టీకి గెలిచిన ఎమ్మెల్యేలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు కష్టకాలం నడుస్తోంది.వరుసగా ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.

అయితే నేరుగా కేసీఆర్ రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు.ఇప్పటికే కారు పార్టీ దిగి మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.కడియం శ్రీహరి,దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు,పోచారం శ్రీనివాస్ రెడ్డి,సంజయ్ కుమార్,కాలె యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే సీఎం రేవంత్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. రేపు తిరుపతి నుంచి నేరుగా సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి టి.ప్రకాశ్ గౌడ్ రానున్నారు.సాయంత్రం 7 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి,పార్టీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.



సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

సీఎం నివాసంలో టి.ప్రకాష్ గౌడ్‌తో పాటు ఇద్దరు మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్లు,ఇతర నేతలు చేరనున్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవ వేడుక

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(నమస్తే ఉదయం):
ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ శశికళ మాట్లాడుతూ.. ప్రపంచ జనాభా దినోత్సవం అనేది ప్రతి సంవత్సరం జులై 11న నిర్వహిస్తారన్నారు. ఇది ప్రపంచ జనాభా సమస్యలపై అవగాహన పెంచడానికి ప్రయత్నిస్తుంది అని వివరించారు. జనాభా తగ్గించడానికి సంబంధించిన నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య అధికారులు ఆరోగ్యశాఖ సిబ్బందికి, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి జనాభా తగ్గించడానికి గల మార్గాలను అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. కే. సిద్ధప్ప, వైద్యాధికారులు డాక్టర్ ఇర్షాద్, డాక్టర్ రాజు, డాక్టర్. రమేష్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, డాక్టర్ రాధిక, మరియు వైద్య సిబ్బంది కె. మధుసూదన్ రెడ్డి, తిరుమలేష్ రెడ్డి, వరలక్ష్మి, నరేంద్రబాబు, శివన్న, లక్ష్మీదేవి, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.



# గురువుల సేవలు మరువలేనివి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(నమస్తే ఉదయం):
సమాజంలో గురువుల సేవలు మరువలేనివని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ధరూర్ మండల కేంద్రంలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శాలువా తో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గురువులే ప్రత్యక్ష దైవమని విద్యలు మనకు ఇచ్చిన గురువుల రుణం తీర్చుకోలేనిదని ఆయన అన్నారు. విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు పిల్లలు తల్లిదండ్రుల తర్వాత ఎక్కువగా ఉపాధ్యాయులతోనే స్కూళ్లు సమయం గడుపుతారని, ఈ పాఠశాల రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో జరిగిందన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, అగ్రికల్చర్ కళాశాల వచ్చే విధంగా నా వంతు కృషి చేస్తాను కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చి చదువుకోవాలన్నారు. భవిష్యత్తులో గద్వాల అన్ని రకాలైన కోర్సులకు సంబంధించిన వాటిని కూడా తీసుకువచ్చి ఏ దూర ప్రాంతాలకు పేద ప్రజలు పేద విద్యార్థులు వెళ్లే పరిస్థితి లేకుండా నా వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఇఓ ఇందిరా, హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డి.ఆర్ విజయ్, డి.వై రామన్న, దౌలన్న, పాఠశాల ఉపాధ్యాయ బృందం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# న్యాయవాదులపై పోలీసుల దాడి హేయం

**రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి**

రాజేంద్రనగర్,జులై 11(నమస్తే ఉదయం):
సిద్ధిపేటలో న్యాయవాది రవికుమార్‌పై సద్ధిపేట పోలీసుల దౌర్జన్యాన్ని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి ఖండించారు.

ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ పిలుపు మేరకు రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ...సిద్ధిపేట న్యాయవాదిపై పోలీసుల దాడి అమానవీయం,చట్ట వ్యతిరేకమన్నారు. తన విధి నిర్వాహణలో భాగంగా వేరొక కేసులో నిందితుడు అయిన తన క్లయింట్‌కు ముందస్తు బెయిల్‌కు సంబందించిన పని కోసం వెళ్లిన న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు.

ఈ దాడిని ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. భాధిత న్యాయవాదికి న్యాయం జరగాలన్నారు. తప్పు చేసిన పోలీస్ వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు రక్షణ చట్టన్ని వెంటనే అమలు చేయాలన్నారు.న్యాయవాదులపై కక్షపూరితంగా దాడులు చేయడం పోలీసులకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్నోసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయవాదుల పరిరక్షణ చట్టం



తీసుకురావాలని విన్నవించినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు.అంతేకాకుండా ఒక న్యాయవాది తన విధులు నిర్వహించే క్రమంలో ఎవరిపై ఎలాంటి వ్యక్తిగత కక్షతో కేసులు వాదించడం జరుగదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి టీఎల్ శ్రీధర్‌రెడ్డి, ప్రతాప్‌గౌడ్, కృష్ణ, నాయక్, వెంకటేశం, రాజేందర్, పెంటారెడ్డి, భూపాల్, అయ్యప్పరెడ్డి, పూర్ణచందర్ రెడ్డి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## కల్కి రేట్లు భారీగా పెంపు

### థియేటర్లకు దూరంగా మిడిల్ క్లాస్



కల్కిచిత్రంలో ఇండియన్ సినిమా లెజెండ్స్ అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ నటించడంతో.. ఈ చిత్రం వాల్యూ మరింత పెరిగింది. ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందనతో పాటు బాక్సాఫీస్ బొనాంజా కలెక్షన్లతో దూసుకుపోతుంది. సైకాలాజికల్, మైథలాజికల్, సోషల్ డ్రామా ఇలా డిఫరెంట్ జానర్‌లను కలిపి ఓ కొత్త ప్రయోగం చేసి సక్సెస్ అయ్యారు. ఈ చిత్రాన్ని దర్శకుడు నాగ్ అశ్విన్. అయితే ఈ చిత్రానికి వచ్చిన పాజిటివ్ టాక్, బజ్‌ను బట్టి ఈ సినిమా కలెక్షన్లు సునాయసంగా 1000 కోట్లకు పైగా వసూలు చేస్తుందని అంచనా వేశారు. సినిమా రిలిజై దాదాపు రెండు వారాలు దాటింది. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం 840 కోట్ల గ్రాస్‌కు చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రం దాదాపు 250 కోట్లకు పైగా గ్రాస్‌ను వసూలు చేసిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే 'కల్కి 2898ఏడీ' సినిమాకు వచ్చిన బజ్, పాజిటివ్ టాక్, రివ్యూలను బట్టి చూస్తే ఈ చిత్రం ఇంతకంటే ఎక్కువే వసూలు చేయాల్సిందని కొంత మంది అంటున్నారు. దీనికి ముఖ్యకారణం టిక్కెట్ల రేట్లు పెంచడమే అని అంటున్నారు. మల్టీప్లెక్స్‌లో ఈ చిత్రం టిక్కెట్ రేటు 400 రూపాయల నుండి 500 వరకు వుండటంతో చాలా మంది మధ్యతరగతి కుటుంబాలు అంతగా ఆసక్తి చూపలేదని చెబుతున్నారు. కనీసం రెండో వారంలోనైనా టిక్కెట్ల ధర తగ్గించి వుంటే.. ఖచ్చితంగా కలెక్షన్లు మరింత పెరిగేవి అని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.


టిక్కెట్ల ధర తమకు అందుబాటులో లేకపోవడంతో మిడిల్‌క్లాస్ ఆడియన్స్ ఓటీటీలో వచ్చినప్పుడు చూద్దాంలే అని థియేటర్లకు వైపు వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. కానీ 'కల్కి 2898ఏడీ' సినిమాను థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా.. ఇలాంటి సినిమాను కూడా టిక్కెట్ల రేట్ల వల్ల ఆడియన్స్ చూడలేకపోవడం కాస్త ఇబ్బందికరమే. సో.. 'కల్కి 2898ఏడీ' సినిమా వసూళ్లకు టిక్కెట్ల ధర పెంపుదల ఎంత అడ్వాంటేజీ అయ్యిందో.. అంతే మైనస్ అయ్యిందని కొంత మంది కామెంట్స్ చేస్తున్నారు.

## 'మిస్టర్ బచ్చన్' ఫస్ట్ సింగిల్



డైరెక్టర్ హరీష్ శంకర్‌కు మ్యూజిక్‌లో మంచి టేస్ట్ వుంది, ఆయన సినిమాలు థియేటర్లలో విడుదలకు ముందే మ్యూజికల్‌గా హిట్ అయ్యాయి. మాస్ మహారాజా రవితేజతో ప్రస్తుతం హరీష్ శంకర్ చేస్తున్న 'మిస్టర్ బచ్చన్' కూడా డిఫరెంట్ జానర్‌లతో కూడిన ఆల్బమ్. ప్రోమోతో ఆదరగొట్టిన తర్వాత, మేకర్స్ ఫస్ట్ సింగిల్- సితార్ లిరికల్ వీడియోని రిలీజ్ చేశారు. సుబ్రమణ్యం ఫర్ సేల్, గద్దలకొండ గణేష్ తర్వాత మిక్కీ జె మేయర్ మళ్లీ హరీష్ శంకర్‌తో జతకట్టారు. ఈ పాట సితార్ సౌండ్స్‌తో ప్రారంభమవుతుంది, ఇది మ్యాజిక్ బీట్‌లతో కూడిన కంప్లీట్ క్లాసికల్ నెంబర్. కెవ్వు కేక, అస్మైక యోగ అనే రెండు చార్ట్‌బస్టర్‌ల తర్వాత, హరీష్ , లిరిక్ రైటర్ సాహితీ రీయూనిట్‌లో వచ్చిన ఈ పాట మెస్మరైజింగ్ లిరిక్స్ తో ఆకట్టుకుంది. ట్రాక్‌కి అందించిన పదాలు జెమ్స్, సాకేత్ కొమందూరి, సమీర భరద్వాజ్ వోకల్స్ అద్భుతంగా వున్నాయి. అలాగే, చారులత మణి క్లాసిక్ రాగం ట్రూలీ క్లాసికల్. బ్యాక్ పాకెట్, హిప్ మూవ్‌లు ఎలిగెంట్‌గా వున్నాయి. రవితేజ స్టైలిష్ ఎటైర్‌లో యంగ్ అండ్ డాషింగ్‌గా కనిపించారు. భాగ్యశ్రీ బోర్స్ గ్లామరస్ దివాలా ఆకట్టుకుంది. వీరిద్దరూ ఆకట్టుకునే కెమిస్ట్రీని పంచుకున్నారు. రవితేజ డ్యాన్స్ మూమెంట్స్ ఎక్స్ లెంట్‌గా వుండగా భాగ్యశ్రీ తన ఎలిగెంట్ మూమెంట్స్‌తో మెస్మరైజ్ చేసింది. శేఖర్ మాస్టర్ తన అద్భుతమైన కొరియోగ్రఫీతో విజువల్స్‌కి మరింత ఎలిగెన్స్ తీసుకొచ్చారు. అయాంకా బోస్ విజువల్స్ చాలా ఎనర్జిటిక్ అండ్ బ్యూటీఫుల్‌గా వున్నాయి. కాశ్మీర్ లోయలోని ఎక్సోటిక్ లొకేషన్లను చాలా ఆకర్షణీయంగా చూపించారు.

## 'కన్నప్ప'.. తిన్నడు ఉపయోగించే విల్లు విశేషాలివే...



డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' మీదున్న అంచనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కన్నప్ప టీజర్ అన్ని వర్గాల ఆడియెన్స్‌ను ఆకట్టుకుంది. ఇక తాజాగా విష్ణు తన కన్నప్ప సినిమాలో భాగంగా వాడిన విల్లు విశిష్టతను గురించి చెప్పుకొచ్చారు. 'కన్నప్ప'లో తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు. ఆ ధనస్సు ధైర్యానికి సూచిక. తండ్రీకొడుకుల మధ్య బంధానికి సూచికగా నిలుస్తుంది.

కన్నప్ప తండ్రి నాథనాథ తన చేతుల్తో తయారు చేసిన ఆ విల్లు కుటుంబ వారసత్వంగా మారింది. ఆ విల్లుతో కన్నప్ప యుద్ధభూమిలో అసమానమైన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శిస్తారు. కేవలం ఐదేళ్ల వయసున్న కన్నప్ప అనే యువకుడు ఓసారి అడవిలో క్రూరమైన పులిని ఎదుర్కొంటాడు. ఒక సాధారణ కర్రతో పోరాటం చేసి ఆ పులి నుంచి తప్పించకుంటాడు. అంత చిన్న వయసులో తన కొడుకు ధైర్య సాహసాల్ని చూసి నాథనాథుడు మురిసిపోతాడు. కన్నప్ప శౌర్యానికి ప్రతీకగా ప్రత్యేకమైన విల్లును తయారు చేస్తాడు. ఆ పులి ఎముకలు, దంతాలతో చేసిన ఆ విల్లు బలానికి, ధైర్య సాహసాలకి ప్రతీకగా నిలుస్తుంది. ఆ విల్లుని రెండుగా విరిస్తే యుద్ధంలో పోరాడేందుకు కత్తుల్లానూ ఉపయోగపడేలా రూపొందించారు.విష్ణు చెప్పిన కథను శ్రద్ధగా విన్న న్యూజిలాండ్‌లోని చిత్ర కళా దర్శకుడు క్రిస్ ప్రత్యేకమైన విల్లుని తయారు చేశారు. కన్నప్ప సినిమా విజన్‌కు అనుగుణంగా, విష్ణు మంచు అంచనాలకు తగ్గట్టుగా ఆ ధనస్సుని రూపొందించాడు. ఈ విల్లుతోనే న్యూజిలాండ్‌లో రెండు నెలల పాటు చిత్రీకరించారు.

## కింగ్ చేతుల మీదుగా 'బహిష్కరణ' ట్రైలర్ విడుదల..



యాబైకి పైగా చిత్రాల్లో హీరోయిన్‌గా, విలక్షణ పాత్రల్లో మెప్పించిన నటి అంజలి. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో జీ 5, పిక్సల్ పిక్చర్స్ ఇండియా బ్యానర్స్‌పై రూపొందుతోన్న వెబ్ సిరీస్ 'బహిష్కరణ'. ముఖేష్ ప్రజాపతి ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. విలేజ్ రివేంజ్ డ్రామా జోనర్‌లో రూపొందుతోన్న ఈ సిరీస్‌లో 6 ఎపిసోడ్స్ ఉంటాయి. ఈ వెబ్ సిరీస్ జూలై 19 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను టాలీవుడ్ కింగ్ నాగార్జున విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. మంచోడు చేసే తప్పేంటో తెలుసా.. చెడ్డోడి చరిత్ర గురించి తెలుసుకోవటం అనే డైలాగ్‌తో ప్రారంభమైంది. ఓ వైపు పచ్చటి పల్లెటూరు, అక్కడ అంజలి, శ్రీతేజ్, అనన్య నాగళ్ల పాత్రల మధ్య సన్నివేశాలను అందంగా చూపిస్తూనే, పల్లెటూరులో ఊరి పెద్ద, అతని మనుషులు చేసే దురాగతాలను చూపించారు.. అలాంటి పల్లె టూర్లోకి పుష్ప అనే అమ్మాయి వస్తుంది. ఆమె వచ్చిన తర్వాత అక్కడి పరిస్థితులు మారుతాయి. ఇంతకీ పుష్ప అక్కడికెందుకు వచ్చింది.. ఊరి పెద్దతో ఆమెకున్న రిలేషన్ ఏంటి? అమ్మాయిలను ఆటవస్తువులుగా చూసింది ఎవరు? ఇలాంటి ఎన్నెన్నో ప్రశ్నలకు సమాధానం బహిష్కరణ సిరీస్. అంజలి పాత్రను గమనిస్తే.. ఓ వైపు ప్రేమ కురిపిస్తూనే మరో వైపు ఆగ్రహావేశంతో ఊగిపోయే ఆమె పాత్రను చూస్తుంటే ఆమె పోషించిన పాత్రలోని భావోద్వేగాలు ఎంత లోతుల్లో ఉన్నాయో అర్థమవుతుంది. శ్రీతేజ్, అనన్య నాగళ్ల పాత్రలతో పాటు ఊరి పెద్ద పాత్రలో రవీంద్రన్ విజయ్‌ను చూడొచ్చు. ప్రశాంతంగా ఉండే ఆ పల్లెటూరుకి అమ్మాయి ఎందుకు వచ్చింది.



## "తంగలాన్" ట్రైలర్ రిలీజ్

చియాన్ విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ "తంగలాన్". ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. నీలమ్ ప్రొడక్షన్స్ తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. "తంగలాన్" సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. "తంగలాన్" సినిమా త్వరలోనే వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "తంగలాన్" ట్రైలర్ రిలీజ్ చేశారు. "తంగలాన్" సినిమా ట్రైలర్ ఎలా ఉందో చూస్తే - బ్రిటీష్ పాలనా కాలంలో కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ లో బంగారం కోసం వేట మొదలుపెడతారు బ్రిటీష్ అధికారులు. స్థానిక తెగల వారిని బంగారం వెలికి తీసేందుకు పనిలో పెట్టుకుంటారు. ఒక తెగ నాయకుడిగా విక్రమ్ ను చూపించారు. ఈ బంగారం వేటలో రెండు తెగల మధ్య పోరు మొదలవుతుంది. తన వారిని కాపాడుకునేందుకు ఎంతటి సాహసానికైనా వెనకడుగు వేయని నాయకుడిగా విక్రమ్ చూపించిన భావోద్వేగాలు ఆకట్టుకుంటు న్నాయి. విక్రమ్ ఈ పాత్ర కోసం మారిపోయిన తీరు కూడా ఆశ్చర్యపరుస్తోంది. ట్రైలర్ లో విల్లు, బరిసెలు, ఈటెలతో చేసిన యాక్షన్ సీక్వెన్సులు హైలైట్ గా నిలుస్తున్నాయి. విక్రమ్ బ్లాక్ పాంథర్ తో చేసిన ఫైట్స్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు త్వరలోనే "తంగలాన్" సినిమా విడుదలకు సిద్ధమవుతోంది.

## 'విరాజి' ఫస్ట్ లుక్



మహా మూవీస్ మరియు ఎమ్ 3 మీడియా బ్యానర్ పై వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం "విరాజి". ఈ చిత్రం యొక్క ఫస్ట్ లుక్ మరియు టీజర్ ను బ్లాక్ బస్టర్ బేబీ చిత్ర దర్శకుడు సాయి రాజేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి రాజేష్ గారు మాట్లాడుతూ "ఇప్పుడే విరాజి టీజర్ చూసాను, చాలా బాగుంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి.

వరుణ్ సందేశ్ లుక్ అదిరిపోయింది. క్యారెక్టర్ కోసం అంత అంకిత భావంతో పని చేస్తున్న వరుణ్ సందేశ్ కి కంగ్రాట్స్. ప్రమోషన్ లో కూడా తన క్యారెక్టర్ గెట్ అప్‌లో పర్మనెంట్ హెయిర్ కలర్ లో ఉండటం చాలా అరుదు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి. అలాగే దర్శకుడు ఆద్యంత్ హర్ష మా నెల్లూరు వాడు కావడం చాలా సంతోషం. మైత్రి మూవీ మేకర్స్ వాళ్ళు ఈ చిత్రాన్ని విడుదల చేయడం చాలా సంతోషం.

ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల అవుతుంది, నిర్మాత మహేంద్ర గారికి ఈ చిత్రం మంచి విజయం సాధించాలి" అని తెలిపారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "ఈరోజు మా విరాజి చిత్రం ఫస్ట్ లుక్ మరియు టీజర్‌ను బేబీ దర్శకుడు సాయి రాజేష్ విడుదల చేయడం చాలా సంతోషం. ఈ చిత్రం నాకు చాలా స్పెషల్. సినిమా చాలా బాగా వచ్చింది, ఆగస్టు 2న విడుదల అవుతుంది.

## 'ద బర్త్‌డే బాయ్' ట్రైలర్

కంటెంట్ ఈజ్ కింగ్ అని ఇప్పటి వరకు ఎన్నో సినిమాలు నిరూపించాయి. కథ, కథనాలు బాగుంటే కొత్త నటీనటుల సినిమాలు అయినా మన తెలుగు ప్రేక్షకులు సూపర్‌హిట్ చేస్తారు. ఆ కోవలోనే స్ట్రాంగ్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'ద బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్‌కనకాల ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో పలువురు నూతన నటీనటులు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని బొమ్మ బొరుసా పతాకంపై ఐ.భరత్ నిర్మిస్తున్నారు.



ఈ చిత్రానికి విస్కి దర్శకుడు. జూలై 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌కు, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుక బుధవారం హైదరాబాద్‌లో వినూత్నంగా ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి జబర్దస్త్ ఫేం రోహిణి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాటాల్లడుతూ యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్ర కథ రాసుకున్నాను. నా జీవితంలో తొమ్మిది సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటనకు కథ రూపం ఇది. ఈ సినిమా నచ్చితే ఇద్దరికి చెప్పండి. నచ్చకపోతే పది మందికి చెప్పండి. నా అసలు పేరును, నా ఫేస్‌ను సినిమా విడుదలైన తరువాత రివీల్ చేస్తాను. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుందనే నమ్మకం వుంది' అన్నారు. నిర్మాత ఐ.భరత్ మాట్లాడుతూ ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశం కొత్తగా వుంటుంది.ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లినప్పుడు ఐదుగురు చిన్ననాటి స్నేహితులకు జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం.

## 'ఆల్ఫా' షూటింగ్‌లో ఆలియాభట్

బాలీవుడ్ లేడీ సూపర్‌స్టార్ ఆలియాభట్ యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ ఫిల్మ్ 'ఆల్ఫా'కోసం షూటింగ్ మొదలుపెట్టారు. అత్యంత భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది ఆల్ఫా సినిమా. యష్‌రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న స్పై యూనివర్స్ మూవీ 'ఆల్ఫా'. ఇటీవల గ్రాండ్‌గా అనౌన్స్ అయిన ఈ సినిమా సెట్స్ కి హాజరయ్యారు నటి ఆలియా భట్. ఇప్పుడు వైరల్ అవుతున్నది 'ఆల్ఫా'లో ఆలియా అసలైన లుక్ కాదు. సినిమాలో ఆమె లుక్ ఎవరి ఊహలకూ అందనంత గొప్పగా ఉంటుంది. ఆమె సెట్స్ లోకి ఎంటర్ అవుతున్నప్పుడు క్లిక్‌మనిపించిన లుక్కే వైరల్ అవుతోంది. అసలు ఆల్ఫా సెట్స్ నుంచి లుక్ లీక్ అయ్యే ఛాన్సే లేదు. సెట్‌కి అంతగా భద్రతను కల్పించింది యూనిట్. ఫస్ట్ ఫీమేల్ లీడ్ యష్‌రాజ్ స్పై యూనివర్స్‌గా తెరకెక్కు తోంది 'ఆల్ఫా'. ఇందులో ఆలియా సూపర్ ఏజెంట్‌గా నటిస్తారు. శివ రవైల్ ఈ సిని మాకు దర్శకత్వం వహిస్తున్నారు. యష్‌రాజ్ ఫిల్మ్స్‌లో ఇంతకు ముందు ప్రపంచ ప్రఖ్యాత ప్రాజెక్ట్ 'ది రైల్వే మెన్'కు డైరక్ట్ చేసిన ఘనత శివ రవైల్‌ది. భోపాల్ గ్యాస్ ట్రాజెడీ ఆధారంగా తెరకెక్కిన ఆ ప్రాజెక్ట్ గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటుంటారు ఆడియన్స్. యష్‌రాజ్ స్పై వర్స్ గురించి చెప్పుకోవాలంటే ఏక్ థా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్, టైగర్3 సినిమాలను ప్రస్తావించకుండా ఉండలేం.



Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733